కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



చంద్రప్రభ వాహనంపై స్వామివారు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ శివాజీనగర్‌లోని వేంకటేశ్వర పెరుమాళ్ ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో స్వామివారిని వివిధ వాహనాలపై సికింద్రాబాద్ పురవీధుల్లో ఊరేగిస్తున్నారు. మంగళవారం ఉదయం సూర్యప్రభ వాహనంపై సాయంత్రం చంద్ర ప్రభవాహనంపై ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో మేళతాళాలతో స్వామివారి ఊరేగింపులో పాల్గొన్నారు.

ఏఎస్‌ఐకి వీడ్కోలు



వీడ్కోలు పలుకుతున్న ఏసీపీ శంకర్‌రాజు, సిబ్బంది

రాంగోపాల్‌పేట్: గోపాలపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏఎస్‌ఐగా మంగళవారం పదవీ విరమణ చేసిన ప్రశాంత్‌రెడ్డికి పోలీసు అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. స్టేషన్ ఆవరణలో ఉత్తర మండలం ఏసీపీ శంకర్‌రాజు, ఇన్‌స్పెక్టర్ రవికుమార్ కానిస్టేబుళ్లు కలిసి ఆయనను ఘనంగా సత్కరించారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కంటోన్మెంట్: తిరుమలగిరి మండల పరిధిలోని 9 మంది లబ్ధిదారులకు కల్యాలక్ష్మి, షాదీముబారక్ కింద ఆర్థిక సాయం మంజూరైంది. దీంతో ఎమ్మెల్యే శ్రీ గణేష్ పికెట్‌లోని క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు మంగళవారం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదింటి కుటుంబాలు ఆడపిల్లల పెళ్లి చేసి అప్పుల పాలు కావద్దనే ఉద్దేశంతో ప్రభుత్వం రూ.1,00,116 అందిస్తున్నదన్నారు.

'ప్రపంచం మెచ్చిన నేత ప్రధాని నరేంద్ర మోదీ'



తరలి వెళ్తున్న బౌద్ధనగర్ నాయకులు

బౌద్ధనగర్: ప్రపంచం మెచ్చిన నేత ప్రధాని నరేంద్ర మోదీ అని డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సాయిప్రసాద్ గౌడ్ పేర్కొన్నారు. కొండాపూర్‌లోని హైటెక్స్‌లో మంగళవారం జరిగిన 'మేరా దేశ్ పహలే–ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ నరేంద్ర మోదీ జీ' కార్యక్రమానికి డివిజన్ నుంచి పెద్ద సంఖ్యలో బీజేపీ నేతలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని తీసుకుంటున్న చర్యలతో దేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్నాదన్నారు. నాయకులు రవి ప్రసాద్ గౌడ్, సుబ్బారావు, శ్యామ్, అగుల్ల శీను, నీలేష్, రమణ, శంకర్, రాజేశ్, శీను, బాబు రావు, దిలీప్ తదితరులు ఉన్నారు.

ఓయూ చీఫ్ వార్డెన్‌కు సన్మానం



లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ చీఫ్ వార్డెన్ డాక్టర్ కొర్రెముల శ్రీనివాస్‌రావు ఇటీవల అసిస్టెంట్ ప్రొఫెసర్ నుంచి అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. దీంతో పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు మంగళవారం శ్రీనివాసరావును ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ నంద్రు నరసింహరావు, ఓంకార్ మాదిగ, కంటెపూడి ప్రభాకర్, రామచంద్రం తదితరులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

గాంధీఆస్పత్రి: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ వాణి పేర్కొన్నారు. పవర్‌గ్రిడ్ సంస్థ నేతృత్వంలో ఆస్పత్రి ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. వనాల పెంపుతోనే మానవ మనుగడ సాధ్యమని, మొక్కలు నాటడమే కాకుండా సంరక్షణ చర్యలు కూడా తీసుకోవాలన్నారు. ఆర్‌ఎంఓలు శేషాద్రి, రజని, కల్యాణ్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పవర్‌గ్రిడ్ ప్రతినిధులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ వాణి

దుర్గాదేవి నమోస్తుతే..!



అమ్మవారిని దర్శించుకున్న వెల్లాల రామ్మోహన్

దేవీ శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారు మంగళవారం దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, నాయకులు, ప్రజాప్రతినిధులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే పలు చోట్ల హోమాలు.. అన్నదానాలు.. కుంకుమార్చనలు నిర్వహించారు. – సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ జోన్ బృందం



దుర్గాదేవి అలంకరణలో ఉజ్జయినీ మహంకాళి అమ్మవారు



మహంకాళి అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి



బౌద్ధనగర్‌లో పూజలు చేసిన ఏసీపీ శషాంక్‌రెడ్డి



బల్కంపేట ఆలయానికి పోటెత్తిన భక్తులు



దుర్గాదేవి అలంకరణలో బేగంపేట కట్టమైసమ్మ మహాలక్ష్మి



ఎల్లమ్మకు నిమ్మకాయలతో అలంకరణ



బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో పాట్న హైకోర్టు న్యాయమూర్తి అన్నపూర్ణ చక్రవర్తి



పోచమ్మ ఆలయంలో సామూహిక కుంకుమార్చన..



దుర్గాదేవీ పూజలో సీఈఓ మధుకర్ నాయక్, బోర్డు అధికారులు



లాలాపేట విజయ దుర్గా ఆలయం వద్ద అన్నదానం ..

'పీహెచ్‌డీ సీట్ల కేటాయింపులో అన్యాయం'

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ 2025–పీహెచ్‌డీ కేటగిరి 2 సీట్ల కేటాయింపులో ఎస్సీ వర్గీకరణ అమలు చేయలేదని దీంతో మాదిగలు తీవ్రంగా నష్టపోయారని ఎంఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ అన్నారు. ఓయూ రిజిస్ట్రార్, ఓఎస్డీలను మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని అమల్లోకి తీసుకువచ్చినప్పటికీ దానికి విరుద్ధంగా, సుప్రీంకోర్టు తీర్పు, రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా మ్యాట్రిక్స్ విధానంలో సీట్ల భర్తీ చేపట్టారని ఆరోపించారు. ఓపెన్ కేటగిరిలో ఇచ్చిన సీట్లను రద్దు చేయాలన్నారు. అడ్మిషన్ల ప్రక్రియలో మొదటి రోస్టర్ నుంచి చివరి రోస్టర్ వరకు ఎస్సీ వర్గీకరణను సంపూర్ణంగా అమలు చేయాలనీ వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో వలిగొండ నరసింహ, భీమ్ ఆర్మీ తీగల శివ, తోకల చిరంజీవి, గణేశ్, ఎర్ర స్వామి తదితరులు ఉన్నారు.



ఓయూ రిజిస్ట్రార్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎంఎస్ఎఫ్ విద్యార్థులు

ఉత్తమ బతుకమ్మలకు బహుమతుల ప్రదానం



బహుమతులు అందజేస్తున్న దృశ్యం



బహుమతులు అందిస్తున్న సాయిబాబా

సనత్‌నగర్: జెక్‌కాలనీ బతుకమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో సంప్రదాయ రీతిలో బతుకమ్మలను తీర్చిదిద్దిన మహిళామణులకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రథమ బహుమతిని స్వాతి (వాసవీ ఇంద్రప్రస్థ), ద్వితీయ బహుమతి లత (వాసవీ డ్రీమ్స్), తృతీయ బహుమతి స్రవంతి (వాసవీ ఇంద్రప్రస్థ), నాలుగో బహుమతి బాలమణి (సెంట్రల్ కోర్టు), ఐదో బహుమతి బాలమణి (శాంతివిహార్) గెలుచుకున్నారు. అలాగే 18–25 ఏళ్ల విభాగంలో చైతన్యలక్ష్మి (విజయగ్రాండ్యువర్) ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. వీరికి కృష్ణకుమారి, విజయ, భాగ్యలత, సుజన, పద్మలత బహుమతులు అందించేందుకు ముందుకువచ్చారు. విజేతలకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని చేతుల మీదుగా బహుమతులు అందజేయనున్నారు. 9 రోజుల పాటు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించిన బతుకమ్మ ఉత్సవ కమిటీ అధ్యక్షురాలు చింతిరెడ్డి అనంతరెడ్డి, ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణతో పాటు సభ్యులను అతిథులు అభినందించారు. కార్యక్రమంలో జెక్‌కాలనీ ఫెడరేషన్ అధ్యక్షుడు మల్లు ప్రసాద్, ప్రతినిధులు సుబ్బరాజు, విశ్వనాథరాజు, అనంతరెడ్డి, బిల్డర్ రాజా, నాగిరెడ్డి, శివారెడ్డి, రామ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్‌లో..

కంటోన్మెంట్: బోయిన్‌పల్లిలోని కంటోన్మెంట్ ప్లే గ్రౌండ్ ఆవరణలో బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకల్లో వందలాది మంది మహిళలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే శ్రీగణేశ్ ముఖ్య అతిథిగా హాజరై ఉత్తమ బతుకమ్మలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు.

చిలకలగూడ: చిలకలగూడ జీహెచ్ఎంసీ పార్కులో నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు టీపీసీసీ గ్రేటర్ ఉపాధ్యక్షుడు, నాగులూరి నర్సింహా పబ్లిక్ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడు నాగులూరి సాయిబాబా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అందంగా తీర్చిదిద్దిన బతుకమ్మలు పేర్చిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో అసోషియేషన్ ప్రతినిధులు యాదగిరి, అంజయ్య, వెంకట్, కేబుల్ శ్రీను, మనోహర్‌బాబు, ఆంజనేయులు, సతీశ్, ప్రమోద్, సంపత్ పాల్గొన్నారు.



మహిళలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

ఇద్దరి అదృశ్యం



అభిషేక్

చిలకలగూడ : యువకుడు అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. శ్రీనివాసనగర్‌కు చెందిన అభిషేక్ (22) నగరంలోని ఓ కాలేజీలో డిగ్రీ చదువుతున్నాడు. రైల్వే ఉద్యోగి అయిన తండ్రి రవిబాబు గుంతకల్‌కు వెళ్లగా, తల్లి జ్యోతి బంధువుల ఇంటికి ఏలూరు వెళ్లింది. ఇంట్లో సోదరుడు ఆదర్శ్‌తో కలిసి అభిషేక్ ఉంటున్నాడు. సెప్టెంబర్ 20న ఈఎంఐ కట్టకపోవడంతో తల్లి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. ఇంటికి వచ్చి చూడగా ఆదర్శ్ ఒక్కడే ఉన్నాడు. 21న బయటకు వెళ్లిన అభిషేక్ ఇంటికి చేరలేదు. దీంతో పలు ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఫలితం లేకపోవడంతో తల్లి పోలీసులను ఆశ్రయించింది. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడిన అభిషేక్ గతంలోనూ డబ్బులు పోగొట్టుకుని బయటకు వెళ్లి కొన్ని రోజుల తర్వాత తిరిగి వచ్చాడని ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు.

బాలుడు..



రాహుల్

◆ బాలుడు అదృశ్యమైన ఘటన చిలకలగూడ ఠాణా పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలకలగూడ మైలార్‌గడ్డకు చెందిన రాహుల్ (13)కు మాటలు సరిగారావు. ఈనెల 28న సాయంత్రం 7 గంటలకు బయటకు వెళ్లిన రాహుల్ తిరిగి ఇంటికి రాలేదు. దీంతో పలు ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఫలితం లేకపోవడంతో తల్లి శివపార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు.

ప్రయాణికుడి ప్రాణాలు కాపాడిన ఆర్పీఎఫ్ కానిస్టేబుల్

అడ్డగుట్ట: ప్రయాణికుడి ప్రాణాలు ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ కాపాడిన ఘటన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో జరిగింది. ఆర్పీఎఫ్ ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లోని కాచిగూడ్ ఎండ్‌లో ఈనెల 26న సాయంత్రం 5 గంటల సమయంలో రైలు కదులుతోంది. వి. ప్రవీణ్‌కుమార్ అనే ప్యాసింజర్ రైలు ఎక్కబోయి కాలుజారి ప్లాట్‌ఫాం, రైలు మధ్యలో పడుతుండగా ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ ప్రవీణ్ కుమార్ చాకచక్యంగా ప్రయాణికుడిని వెనక్కి లాగాడు. 'ఆపరేషన్ జీవన్ రక్ష' లో భాగంగా అనేక మంది ప్రయాణికుల ప్రాణాలు కాపాడుతున్నామని పేర్కొన్నారు. ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ ప్రవీణ్‌కుమార్ సాహసాన్ని అభినందిస్తూ రివార్డు ప్రదానం అందజేయనున్నట్లు తెలిపారు.

రోగి సహాయకుడి ఆత్మహత్యాయత్నం



గాంధీఆస్పత్రి: ఆస్పత్రి భవనంపై నుంచి కిందకి దూకి రోగి సహాయకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో జరిగింది. ఆస్పత్రి పాలన యంత్రాంగం, చిలకలగూడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా నాతన్‌కల్ గ్రామానికి చెందిన బ్యాగారి మల్లేశ్ కిడ్నీ సంబంధత వ్యాధితో గాంధీ ఆస్పత్రి అత్యవసర విభాగం మూడో అంతస్తులోని ఏఎంసీ వార్డులో చేరాడు. కుమారుడు వినయ్‌కుమార్ (28) సహాయకుడిగా సేవలు అందిస్తున్నాడు. మంగళవారం ఉదయం నుంచి వినయ్‌కుమార్ పిచ్చిపిచ్చిగా ప్రవర్తించాడు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో దగ్గరలో ఉన్న ఓ వైద్యుడు అడ్డుకున్నప్పటికీ వినయ్‌కుమార్ పెద్దగా అరుస్తు మూడో అంతస్తు కిటికి నుంచి కిందకి దూకాడు. కాళ్లుచేతులు విరిగి తీవ్ర గాయాలైన బాధితుడిని గాంధీ ఎమర్జెన్సీ వార్డుకు తరలించి చికిత్స అందిస్తున్నారు. చిలకలగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ముగిసిన హిందీ పక్షోత్సవాలు



సనత్‌నగర్: బేగంపేట విమానాశ్రయంలో హిందీ పక్షోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్ట్ జనరల్ మేనేజర్ కో–ఆర్డినేషన్ ఇన్‌చార్జి అచింతకుమారదత్త మాట్లాడుతూ.. 1949 సెప్టెంబర్ 14న రాజ్యాంగ పరిషత్ హిందీకి అధికార భాష హోదా కల్పించిందని, అందుకే ఏటా సెప్టెంబర్ 14వ తేదీని హిందీ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. జాతీయ సమైక్యత, సమగ్రత చెక్కు చెదరకుండా ఉంచడంలో హిందీ కృషి ప్రశంసనీయమన్నారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ భగవాన్ గవ్హాడే మాట్లాడుతూ.. ప్రపంచ స్థాయిలో హిందీ ప్రభావం పెరుగుతోందన్నారు. అనంతరం అవార్డు విజేతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ (ఏటీసీ) గోపకుమార్, ప్రస్సిల్లా ప్రియా, అపూర్వ జైన్, శుక్లా ఉపేంద్రకుమార్, సీతాసురేశ్ తదితరులు పాల్గొన్నారు.

దసరా వేడుకలకు వేళాయె..!

● ముస్తాబైన జీరా నవగ్రహ హనుమాన్ ఆలయం ● ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు



జీరా నవగ్రహ హనుమాన్ ఆలయం



ఆలయ ప్రాంగణంలో నవగ్రహాలు

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ కర్బలామైదాన్ ఆర్పీ రోడ్డు జీరాలోని నవగ్రహ హనుమాన్ ఆలయం ఈ నెల 2న జరిగే దసరా వేడుకలకు ముస్తాబైంది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండడంతో అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ ఈవో రాజేశ్ కుమార్, ఫౌండర్ ట్రస్టీ, చైర్మన్ ఉదయ్ సింగ్ తెలిపారు. దసరా రోజు ఆలయ ప్రాంగణంలో జమ్మిఆకు ఇతరత్రా దుకాణాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తారు. పండుగ రోజు తెల్లవారు జాము నుంచి అర్ధరాత్రి వరకు భక్తుల తాకిడి ఉంటుంది.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

కంటోన్మెంట్: నీటి సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం లభించనుందని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలోని బాలంరాయి, బోయిన్‌పల్లిలో హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో చేపట్టిన తాగునీటి సంపుల పనులను కంటోన్మెంట్ బోర్డు వాటర్ వర్క్స్ సూపరింటెండెంట్ రాజ్ కుమార్, అసిస్టెంట్ ఇంజినీర్ శశాంక్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలంరాయిలో గతంలో ఉన్న 5 లక్షల గ్యాలన్లను 6.5 లక్షల గ్యాలన్లు, బోయిన్‌పల్లిలో 2 లక్షల గ్యాలన్ల సామర్థ్యంతో రూ.5.20 కోట్లతో పనులు చేపట్టామన్నారు. గతంలో కంటోన్మెంట్‌కు రోజుకు 5.9 మిలియన్ గ్యాలన్ల నీరు మాత్రమే సరఫరా అయ్యేదని, తాను ప్రత్యేక చొరవ తీసుకుని సీఎం రేవంత్ రెడ్డికి విన్నవించడంతో 6.9 మిలియన్ గ్యాలన్లకు పెంచినట్లు గుర్తు చేశారు. స్థలాలు కేటాయిస్తే మరిన్ని పంప్‌హౌజ్‌ల నిర్మాణం చేపడుతామని తెలిపారు.



పంప్‌హౌజ్ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

ఓయూలో కాంట్రాక్టు ఉద్యోగుల ధర్నా



ధర్నా చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ నాన్ టీచింగ్ కాంట్రాక్టు ఉద్యోగులు ఓయూ పాలనా భవనం వద్ద మంగళవారం మహా ధర్నా చేపట్టారు. పెద్ద సంఖ్యలో ఉద్యోగులు రోడ్డుపై బైఠాయించి డిమాండ్లతో కూడిన ప్లకార్డులు ప్రదర్శించారు. ఎన్‌జీవోస్ స్టాఫ్ అసోసియేషన్ నాయకులు, టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్ నాయకులు ధర్నాకు మద్దతు తెలిపారు. ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో సేవలందిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలని ఉద్యోగ సంఘాల నాయకులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఓయూ నాన్ టీచింగ్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సూర్యచందర్, ప్రధాన కార్యదర్శి చేర్యాల శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాగిణి, ఉపాధ్యక్షులు డా.కె. వీరేశం, రాజేశ్, శ్రీకాంత్, చంద్రశేఖర్, ముజాహెద్, హుస్సేన్, దినేశ్, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, ప్రభాకర్, రోసిలిన్, రాజ్యలక్ష్మి, రంగన్న, కృష్ణ, తదితరులు ఉన్నారు.



లోహియానగర్‌లో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న బిజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తీకరెడ్డి

బతుకమ్మ సంబరాలు

బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. మహిళలు, యువతులు తీరొక్క పూలతో బతుకమ్మలు పేర్చి కూడళ్ల వద్ద పెట్టి ఆడిపాడారు. అనంతరం సమీప కొలనులు, చెరువుల్లో నిమజ్జనం చేశారు. –సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ జోన్ బృందం



లాలాపేట యాదవ బస్తీలో సద్దుల బతుకమ్మ వేడుకలు